పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సదస్సులో విద్యార్థులతో కలిసి పాల్గొన్న డాక్టర్ మహి అత్రా

కాచిగూడ: పౌష్టికాహారంతోనే పలు విధాలైన వ్యాధులను దూరం చేసుకోవచ్చని షెనాయ్ హాస్పిటల్స్ న్యూట్రిషన్ విభాగం హెడ్ డా॥ మహి అత్రా అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బర్కత్‌పురలోని శ్రీమతి ఎ. శ్యామలదేవి డిగ్రీ కళాశాలలో న్యూట్రిషన్‌పై విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. మంచి పౌష్టికాహారం తీసుకుంటే రక్తం వృద్ధి చెందుతుందని అన్నారు. మాంసం బదులు కూరగాయలు ఎక్కువగా తినాలని, కాలానుగుణంగా లభించే పండ్లను తీసుకోవాలని, స్థానికంగా దొరికే ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. సులభంగా జీర్ణమయ్యే, సూక్ష్మపోషకాలు లభించే పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. విటమిన్స్ లోపంతో కంటిచూపు మందగిస్తుందని, ఐరన్ లోపంతో రక్తహీనత, జ్ఞాపకశక్తి నశిస్తుందని, కాల్షియం లోపంతో ఎముకల పటుత్వం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర, ప్రిన్సిపాల్ బి.లావణ్య కుమారి, లెక్చరర్లు దీప్తి, దీప, స్వాతి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాలు

శ్రీసీతారామాంజనేయ సరస్వతి దేవాలయం ముస్తాబు



ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసిన దృశ్యం



ముస్తాబైన న్యూనల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయం

నల్లకుంట: న్యూనల్లకుంటలోని శ్రీ సీతా రామాంజనేయ సరస్వతి దేవాలయం(న్యూ రామాలయం)లో ఈ నెల 13 నుంచి 21వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు నవహాన్నిక దీక్షలో శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆలయం ప్రాంగణంలో చలువ పందిళ్లు వేయించి, విద్యుత్‌దీపాలతో అలంకరించారు. బుధవారం ఆలయ ఇంచార్జీ ఈఓ కె.మార్తాండరావు బ్రహ్మోత్సవాల వివరాలను వెల్లడించారు. కళ్యాణవేడుకలో పాల్గొనే భక్తులు మరిన్ని వివరాల కోసం ఆలయ గుమస్తాను సంప్రదించాలని కోరారు.

టికెట్ల కేటాయింపులో గౌడలను విస్మరించిన కాంగ్రెస్

గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షుడు నారాయణగౌడ్



సుందరయ్య విజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో బలమైన సామాజికవర్గమైన గౌడలకు పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా కాంగ్రెస్ పార్టీ కేటాయించకపోవడం సరైందికాదని గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ అన్నారు. గౌడ సామాజికవర్గాన్ని విస్మరిస్తే తమ సత్తా చాటడం ఖాయమని ఆయన హెచ్చరించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న గౌడ సామాజికవర్గం అన్ని వర్గాలతో కలిసి తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా గౌడ సామాజిక వర్గాన్ని గుర్తించి లోక్‌సభ సీట్లు కేటాయించాలన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లో ఇచ్చిన సామాజిక గౌరవం కాంగ్రెస్ పార్టీ పాటించాలని కోరారు.

ముందస్తు ఆస్తిపన్ను చెక్కుల స్వీకరణ



ఆస్తిపన్ను చెక్కు స్వీకరిస్తున్న మారుతీదివాకర్

అంబర్‌పేట్: ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుదారుల నుంచి జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 డీఎంసీ మారుతీ దివాకర్ బుధవారం చెక్కులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ఏప్రిల్‌లో ముందస్తు ఆస్తి పన్ను చెల్లించినవారికి ఎర్లీ బర్డ్ పేరిట 5 శాతం రాయితీ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ చేపట్టే అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. కాచిగూడలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న గౌతంరావు



డీడీ కాలనీలో ప్రచారం చేస్తున్న కావ్యాకిషన్‌రెడ్డి

కాచిగూడ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో అంబర్‌పేట, నాంపల్లి నియోజక వర్గాల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిషన్‌రెడ్డి విజయానికి పార్టీ కార్యకర్తలు, నేతలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా మోదీ హవానే నడుస్తుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు చింతల రాంచంద్రారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, యాదగిరిరెడ్డి, సందీప్ సాయి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డికి మద్దతుగా కాలనీల్లో ప్రచారం

అంబర్‌పేట్: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి ఓటర్లను కోరారు. బుధవారం బాగ్ అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీలో పలు అపార్ట్‌మెంట్లు, కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులను కలిసి బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతు తెలపాలని ఆమె కోరారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు అందరూ అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట బీజేపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, పాపారావు, పాండురంగయ్య, భాస్కర్, వెంకట్‌గౌడ్, నీలం శుక్ల, ప్రేమ్, కవిత, సునంత తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

చిక్కడపల్లి: హిందువులు, ముస్లింలు తమ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం ఇక్కడ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్యతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి పండుగల సందర్భంగా ఎలాంటి సమస్యలు వచ్చినా పోలీసులను ఆశ్రయించాలని , పరిష్కారం కోసం తాము ప్రయత్నిస్తామని తెలిపారు. అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

రంజాన్ వేడుకలకు ఏర్పాట్లు



అంబర్‌పేట ముస్సిపల్ గ్రౌండ్‌లో రంజాన్ ఏర్పాట్ల దృశ్యం

అంబర్‌పేట్: రంజాన్ వేడుకలకు ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. నేడు (గురువారం) అంబర్‌పేట నియోజకవర్గ వ్యాప్తంగా రంజాన్ పర్వదినాన్ని నిర్వహించేందుకు పలు మసీదులు ముస్తాబయ్యాయి. అంబర్‌పేట ముస్సిపల్ మైదానంలో సామూహిక ప్రార్థనల కోసం సౌకర్యాలు సమకూర్చారు. రంజాన్ వేడుకల కోసం అధికార యంత్రాంగం సైతం ఏర్పాట్లు చేసింది.

డ్రంకన్ డ్రైవ్‌లో 16 మందికి జరిమానా, ఐదుగురికి జైలు

కాచిగూడ: డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 21 మంది వాహనచోదకులను కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు బుధవారం నాంపల్లి కోర్టులోహాజరు పరిచారు. అందులో 16 మందికి రూ.2,100 జరిమానా, మొదటిసారి తాగడం వల్ల ఇద్దరికి రెండురోజుల జైలు, రెండోసారి మద్యం సేవించడం వల్ల ఇద్దరికి నాలుగు రోజులు, మూడోసారి తాగడం వల్ల ఓ వ్యక్తికి 15 రోజుల జైలుశిక్ష వేసిందని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనుమల శ్రీనివాస్ తెలిపారు.

ఓయూలో అధ్యాపక నియామకాలు హుళక్కే

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ ఏడాది చివరినాటికి వరుసగా ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ ఖాళీగా ఉన్న అధ్యాపక నియామకాలకు అడ్డంకిగా మారనున్నాయి. అధ్యాపకుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న ఓయూలో కనీసం కాంట్రాక్టు అధ్యాపకులను కూడా నియమించకుండా గత ప్రభుత్వం 2014లో జీవో జారీ చేసింది. కేవలం పార్ట్‌టైమ్ అధ్యాపకులచే బోధన కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రొఫెసర్ల కొరత కారణంగా పీహెచ్‌డీ ప్రవేశాలు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా వివిధ ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఓయూ విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు.

ఓయూలో బయటి వ్యక్తుల ఆగడాలు అరికట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: క్యాంపస్‌లోకి బయటి వ్యక్తుల ఆగడాలను అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు ఓయూను క్లోజ్డ్ క్యాంపస్‌గా తీర్చిదిద్ది బయటి వ్యక్తులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. బైక్‌రైడింగ్స్, గంజాయి, మద్యం సేవించడం రియల్ ఎస్టేట్ దందాలు, తదితర అసాంఘీక కార్యక్రమాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లి సత్య, భగత్, శ్రీకాంత్, అశ్విన్ తదితరులున్నారు.

పూలే జయంతిని విజయవంతం చేయాలి

చిక్కడపల్లి: సామాజిక సంస్కర్త, దార్శనికుడు బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిభా పూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించాలని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జంగం దశరథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జ్యోతిబా పూలే సతీమణి, భారత మొదటి మహిళా టీచర్ సావిత్రిబాయిపూలే ఎంతోమందిని విద్యావంతులుగా తీర్చిదిద్దారని కొనియాడారు.

నేడు బీసీ భవన్‌లో పూలే జయంతి వేడుకలు



నందగోపాల్‌ను సత్కరిస్తున్న గుజ్జ కృష్ణ

కాచిగూడ: మహాత్మ జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా నేడు(గురువారం) విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తెలిపారు. పూలే జయంతి ఉత్సవ కమిటీ–2024 చైర్మన్‌గా తంగెళ్లమూడి నందగోపాల్ ఎన్నికైన సందర్భంగా బుధవారం కాచిగూడలో ఆయనకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గుజ్జ కృష్ణ మాట్లాడుతూ పూలే జయంతి వేడుకలకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ ఒక్కసారి కూడా పూలే చిత్రపటానికి పూలమాల వేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగతి భవన్‌ను పూలే భవన్‌గా మార్చడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేముల రామకృష్ణ, టి.రాజ్‌కుమార్, దొడ్డుపల్లి రఘుపతి, నీల వెంకటేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిప్నో కమలాకర్ జయంతి



మైనార్టీ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ప్రముఖ సైకాలజిస్టు హిప్నో కమలాకర్ జయంతి వేడుకలను బాగ్‌లింగంపల్లిలోని తెలంగాణ మైనార్టీ ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నవ భారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిప్నో కమలాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్వేత మల్టీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కె.నాగేశ్వరి మాట్లాడుతూ ‘పేరు అందరికీ ఉంటుంది. కానీ, కొంతమందికి మాత్రమే చరిత్రలో నిలిచిపోయే విధంగా అవకాశం ఉంటుంది’అని అన్నారు. యువతీయువకులను చైతన్యం చేయడంలో హిప్నోకమలాకర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, జి.హిమకర్, పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి, అడ్వకేట్ జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థుల కోసం ఇఫ్తార్ విందు నిర్వహించారు.

1,700 మందికి అల్పాహారం, వస్త్రాల పంపిణీ



అల్పాహారం, వస్త్రాలను పంపిణీ చేస్తున్న అరుణ్, కందూరి కృష్ణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కందూరి కృష్ణ ఫౌండేషన్, సేత్ మాణిక్‌లాల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లిలో 1,700 మంది పేదలకు అల్పాహారం, వస్త్రాలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ ఇంజనీర్ తోడుపునీరు అరుణ్ మాట్లాడుతూ నిత్యం అల్పాహారంతోపాటు విద్యా, వైద్యం లాంటి సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడం వల్ల పేద ప్రజలకు బహుళ ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను ఇతరులు కూడా స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కందూరి కృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రమోద్ అగర్వాల్, హైకోర్టు అడ్వకేట్ కౌశిక్, జ్వాలా వరాళి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ హెచ్.గోవింద్‌రావు, ఉషా తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే ‘జలమండలి’ని ముట్టడిస్తాం



కాచిగూడలో రెయిన్‌వాటర్ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కన్నె ఉమారమేష్ యాదవ్

కాచిగూడ: స్థానిక శాంతినికేతన్ స్కూల్ లేన్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రెయిన్‌వాటర్ పనుల్లో సిబ్బంది అలసత్వంపై కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లోపించినా, ప్రజలకు ఇబ్బందులు కలిగినా జీహెచ్‌ఎంసీ, జలమండలి కార్యాలయాలను ప్రజలతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. బుధవారం రెయిన్‌వాటర్ పైపులైన్ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు. వాటర్, సివరేజ్ పైపులు పగిలిపోయి కొంత కాలంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటం వల్ల మరిన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సుభాష్ పటేల్, సత్యనారాయణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి చర్యలు



కేలండర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ గంగాధర్, రఘురాంరెడ్డి

చిక్కడపల్లి: కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు కార్మిక శాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్ తెలిపారు. బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్ కోర్టు కేలండర్–2024ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి కార్మిక కమిషనరేట్‌కు న్యాయం కోసం పేద కార్మికులు వస్తుంటారని, వారికి మానవతాదృక్పథంతో న్యాయ సేవలు అందిచాలని లేబర్ కోర్టు న్యాయవాదులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లేబర్ కోర్ట్ బార్ అసోసియేట్ అధ్యక్షులు కె.రఘురామ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఎం.మధుసూదన్, ఉపాధ్యక్షులు వై.రంజిత్‌రెడ్డి సీహెచ్ ప్రతాప్‌లింగం, సీనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు డి.విలాస్, సభ్యుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

‘సికింద్రాబాద్‌లో కాంగ్రెస్‌దే గెలుపు’



అనిల్‌కుమార్

అంబర్‌పేట్: సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి కోటం అనిల్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం బాగ్ అంబర్‌పేట్‌లోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంటు పార్టీ ఇంచార్జ్‌గా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డి పర్యవేక్షణలో సికింద్రాబాద్‌లో పార్టీ అభ్యర్థిని లక్ష ఓట్ల మెజారీతో గెలిపిస్తామన్నారు. గతంలో సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ రెండుసార్లు గెలిచిన చరిత్ర ఉందన్నారు.

పింగళి వెంకయ్య చరిత్రను భావితరాలకు అందించాలి



గాంధీభవన్ ఇన్‌చార్జికి చిత్రపటాన్ని అందజేస్తున్న కోదండరెడ్డి

ముషీరాబాద్: జాతీయపతాక రూపకర్త పింగళి వెంకయ్య జీవితచరిత్రను భావితరాలకు తెలియజేసేవిధంగా పాలకులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి సూచించారు. పింగళి వెంకయ్యకు భారతరత్న అవార్డు ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ పరంగా కృషి చేస్తామన్నారు. రాంనగర్ గుండులోని పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ కె.హెచ్.ఎస్.జగదాంబ, శ్యామలరావు ఆధ్వర్యంలో బుధవారం గాంధీభవన్‌లో పింగళి వెంకయ్యతోపాటు దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న పలువురు మహనీయుల చిత్రాలతో కూడిన ఫొటోను కోదండరెడ్డి ద్వారా గాంధీభవన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గాంధీభవన్ ఇన్‌చార్జీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు కుమార్‌రావు, టీపీసీసీ కార్యదర్శి జీఎన్ కేశవ్, ట్రస్ట్ సభ్యులు జశ్వంత్, శ్రీకాంత్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల కోసం పోరు



సమావేశంలో పాల్గొన్న రాధాకృష్ణ తదితరులు (ఫైల్)

చిక్కడపల్లి: దేశవ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్ల సాధన, హక్కుల కోసం భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కేఎం రాధాకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని బీఎంఎస్ నగర కార్యాలయం శ్రమశక్తి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆలిండియా కాంట్రాక్ట్ లేబర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండురోజుల సదస్సు ఈ నెల 6, 7 తేదీలలో పూణేలో జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా ఆ సమావేశ విశేషాలను ఆయన వివరించారు. కాంట్రాక్టర్లు పెద్దఎత్తున కార్మికులను దోపిడీ చేస్తున్నారని, ప్రభుత్వం స్పందించి కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశాల్లో 14 రాష్ట్రాల ప్రతినిధులు, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారని రాధాకృష్ణ వివరించారు.

పంచలోహ విగ్రహ సంప్రోక్షణ



విగ్రహ సంప్రోక్షణ దృశ్యం

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం పునర్‌నిర్మాణం అనంతరం ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం శ్రీ అలివేలు మంగ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివార్ల నూతన పంచలోహ విగ్రహ సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంటపారాధన, అవాహిత దేవత వాహనం తదితర కార్యక్రమాలు ఈవో దేవనాథ పర్యవేక్షణలో జరిగాయి.

ఓటింగ్‌కు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

ఎన్నికల అధికారి హేమంత్ కేశవ్ పాటిల్



సికింద్రాబాద్: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్ కోరారు. బుధవారం సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నామినేషన్లు, పోలింగ్‌కు ముందు పోలింగ్ అనంతరం రాజకీయ పార్టీల నాయకులు పోషించాల్సిన పాత్ర గురించి వివరించారు. పోస్టల్ బ్యాలెట్లను వినియోగించాల్సిన తీరు, పోలింగ్ స్టేషన్లలో ఇబ్బందులు అధికారుల దృష్టికి తీసుకురావడం వంటి పద్ధతులను వివరించాలన్నారు. నామినేషన్లు వేయాల్సిన సమయంలో పాటించాల్సిన నిబంధనలు, పోలింగ్, లెక్కింపు సమయాల్లో సహకరించాల్సిన పద్ధతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజెప్పారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, వారి సలహాలు సూచనలను స్వీకరించారు. సహాయక ఎన్నికల అధికారులు వీరారెడ్డి, ఎల్లారెడ్డి, సుభాష్‌రావు, సమ్మయ్య, ఎన్నికల విభాగం ఇన్‌చార్జి భుజేందర్‌బాబు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యక్తి జీవితంలో కెమిస్ట్రీకి అధిక ప్రాముఖ్యం



కోదండరాంను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (లండన్) దక్కన్ విభాగం ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెమిస్ట్రీపై సమ్మర్ వర్క్‌షాపు తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యునిటీహాల్లో బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ కోదండరాం హాజరై వర్క్‌షాపును ప్రారంభించి అనంతరం మాట్లాడారు. వ్యక్తి జీవితంలో రసాయన శాస్త్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. సైన్స్ పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. ప్రోగ్రామ్ కో– ఆర్డినేటర్ ప్రొఫెసర్ పీసపాటి వర్క్‌షాపు ఉద్దేశం, లక్ష్యాలను వివరించారు. ఈ వర్క్‌షాపు 5 రోజుల పాటు కొనసాగుతుందని వివరించారు. డాక్టర్ పి.మోహన్‌రావు మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో సైన్స్‌పాత్ర ఎంతో కీలకమన్నారు. కరోనా టీకాను ప్రపంచంలోని ఇతర దేశాలకు భారతదేశం అందించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అనంతరం కోదండరాంను శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి, నాగార్జుననగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ జలేందర్ రెడ్డి, సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యదర్శి డా. టీవీ.రావు, డా. కె.ఎస్ తాళ్లూరి, డాక్టర్ ఆర్.బి.ఎస్ ప్రసాద్ తదితరులున్నారు.

గొడవ పడిన నలుగురికి ఐదురోజుల జైలుశిక్ష

బంజారాహిల్స్: ఇంటి ముందు రాత్రి పూట కూర్చుంటూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారంటూ జరిగిన గొడవలో బంజారాహిల్స్ పోలీసులు నలుగురు వ్యక్తులపై ఈ–పెట్టీ కేసు నమోదు చేసి నాంపల్లిలోని పదవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మందా మురళి ఎదుట హాజరుపరిచారు. ఈ నలుగురికి న్యాయమూర్తి ఐదు రోజుల జైలు శిక్ష, రూ. 1050 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌లో నివసించే కార్తీక్, చంద్రశేఖర్‌తో పాటు ఎండీ అలీ, ఎండీ సమీర్‌లు మంగళవారం రాత్రి గొడవకు పాల్పడ్డారు. ఇంటి ముందు న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారంటూ జరిగిన గొడవలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. స్థానికంగా ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తూ చుట్టుపక్కల వారికి ఇబ్బందులు కలిగించారు. దీంతో పోలీసులు ఈ నలుగురిపై ఐపీసీ సెక్షన్ 323, 70 (బీ) సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి మందా మురళి ఈ నలుగురికి ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారు.

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలి

బోడుప్పల్: భూగర్భ జలాలు పెంచేందుకు ప్రతి ఇంటి యజమాని ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. బోడుప్పల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు భూగర్భ జలాలు అట్టడుగుకు వెళ్తున్న సందర్భంగా ప్రతి ఇంటి యజమాని ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటి యజమాని, గేటెడ్ కమ్యూనిటీ, అపార్టుమెంట్ యజమానులు తమ సొంత ఇంట్లో వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని నిల్వ చేసుకునేందుకు, భూగర్భ జలాలు పెంచేందుకు, భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చేసేందుకు ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకుని నీటి వనరులను కాపాడుకోవాలన్నారు. అంతా కలిసికట్టుగా బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో నీటి ఎద్దడి రాకుండా వర్షాకాలంలో వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని నిల్వ చేసుకునేందుకు ఇంకుడు గుంతలు ఉపయోగపడతాయన్నారు.